బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ సోమవారం, 25 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## మీడియా సంస్థలకు 'బండి' నోటీసులు



## నిప్పుల కొలిమిలా రాష్ట్రం



- అర్ధ సెంచరీ చేరువకు పగటిపూట ఉష్ణోగ్రతలు
- ఎండ వేడి, వడగాలుల దాడితో
- వడదెబ్బతో పెరుగుతున్న మృతుల సంఖ్య.. ఆగని మూగజీవాల మృత్యువాత
- కార్మికులు, కూలీల అవస్థలు.. పనుల్లేక ఇబ్బందులు
- పొట్ట కూటికోసం మండుటెండలో శ్రామిక వర్గం
- అగ్నిప్రమాదాలతో రూ. కోట్లల్లో నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు, రైతుల వేడుకోలు

వివరాలు 2లో..

# ఫ్రీ కరెంట్ రద్దు కోసమే

# మోటార్లకు మీటర్లు

- కరెంట్ ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్ర
- ప్రీపెయిడ్ మీటర్లతో విద్యుత్తు రంగాన్ని ప్రైవేట్ పరం చేయబోతున్నది
- వ్యవసాయ మోటర్లకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీటర్లు పెట్టబోతున్నది
- సర్కార్ కుయుక్తులను ప్రజలు వ్యతిరేకించాలి..కాంగ్రెస్ ఫ్యూజులు పీకేయాలి
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్తు పోతుందని ఆనాడే హెచ్చరించినం
- ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రీపెయిడ్ కరెంట్ మీటర్లు
- కేసీఆర్ మెడపై మోదీ కత్తి పెట్టినా ఒప్పుకోలే.. 3నెలల్లోనే మీటర్లంటున్న రేవంత్
- ధాన్యం కుప్పలపై రైతులు చస్తున్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- అంబర్‌పేట కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, మే 24: మోటర్లకు మీటర్లు పెట్టకముందే.. ప్రతి ఒకరి ఇంట్లో ప్రీపెయిడ్ మీటర్లు తీసుకురాకముందే కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు తీసివేయాలని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వ్యవసాయ మోటర్లకు, ఇండ్లకు ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన నిప్పులు చెరిగారు. కేవలం ఉచిత విద్యుత్‌ను ఎత్తేయడానికి, విద్యుత్తురంగాన్ని అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకే రేవంత్‌రెడ్డి సరార్ ఈ కుట్రకు తెరలేపిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ వస్తే ఉచిత కరెంట్ పోతుందని తాము ఎన్నికల ముందే హెచ్చరించిన విషయాన్ని కేటీఆర్ నొక్కి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోటర్లకు మీటర్లు పెట్టి పూర్తిగా రైతన్నలకు ఉచిత విద్యుత్తును వివరాలు 3లో..

## ఆర్‌డీఎస్ఎస్ అమలుతో తెలంగాణ చీకటే



- విద్యుత్‌రంగం ప్రైవేటీకరణకు సర్కార్ కుట్ర
- ఈ స్కీమ్‌తో వినియోగదారులకు శాపం
- రైతు డిస్కమ్‌ను అదానీకి కట్టబెట్టే యత్నం
- స్కీమ్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాటం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి

వివరాలు 3లో..

## నెలాఖరుకు కొనుగోళ్లు బంద్!

- ధాన్యం, మక్కల కొనుగోలుపై రాష్ట్ర సర్కార్ సంచలన నిర్ణయం
- జిల్లాలకు అంతర్గత ఆదేశాలు
- గడువు తర్వాత కేంద్రాల మూత
- కొనుగోలుకు మిగిలింది 7రోజులే నేటికీ సగం పంట దిగుబడులు
- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోనే సర్కార్ నిర్ణయంపై విమర్శల వెల్లువ
- మిగిలిన పంట అమ్ముకునేదెక్కడ?
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- మరోవైపు రైతుల్లో వానభయం



హైదరాబాద్, మే 24: రైతుల అనుమానమే నిజమైంది.. కాంగ్రెస్ సర్కార్ అన్నంత పనిచేసింది.. కొనుగోలులో తీవ్రమైన జాప్యం చేస్తూ వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ కొనుగోలు ప్రక్రియనే బంద్ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. రైతులు పండించిన పంటలో చివరిగింజ వరకూ కొంటామని గప్పాలు కొట్టిన సర్కార్ పెద్దలు.. ఇప్పుడు అర్ధంతరంగా చేతులెత్తేసే పనిలో పడ్డారు. కొనుగోలులో ఆలస్యం, నిర్లక్ష్యంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడికక్కడ ధాన్యం, మక్కలు ఇంకా కుప్పలుగా ఉన్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ధాన్యం, మక్కల కొనుగోలును ఈ నెల 31తో ముగించాలని సర్కార్ నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం.ఈ మేరకు ఆదివారం జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో కొనుగోలుకు గడువు విధిస్తూ జిల్లాల అధికారులకు అంతర్గత ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఈ గడువులోగానే వీలైనంత మేరకు ధాన్యం, మక్కలు కొనుగోలు చేయాలని, ఆ తర్వాత కొనుగోలు కేంద్రాలను మూసి వేయాలని ఆదేశించినట్టు తెలిసింది. సర్కార్ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో ధాన్యం, మక్కల కొనుగోలు ఇక కేవలం వారంరోజులపాటు మాత్రమే జరుగనున్నాయి. రాష్ట్రంలో 90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 50 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకా 40 లక్షల టన్నుల ధాన్యం బయటే ఉన్నది. 43 లక్షల టన్నుల మక్కలు ఉత్పత్తికాగా ఇందులో 22 లక్షల టన్నుల కొనుగోలుకు సర్కార్ నిర్ణయించింది.

## మరోసారి భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు



హైదరాబాద్, మే 24: వాహనదారులకు మరోసారి ఊహించని షాక్ తగిలింది. భార త దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగిపోయాయి. లీటర్ పెట్రోల్ పై ఏకంగా రూ. 2.84, అటు డీజిల్ పై రూ. 2.86 చొప్పున ధరలను పెంచాయి ఆయిల్ కంపెనీలు. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. పెరిగిన ధరలు నేటి ఉదయం నుంచి అమలులోకి రాబోతున్నాయి. గడిచిన 15 రోజుల వ్యవధిలోనే ఇప్పటికే నాలుగు సార్లు చమురు ధరలు పెరిగినట్లు అయింది.

## వరంగల్ కాంగ్రెస్‌లో ఆధిపత్యపోరు..


- ఎంపీ వేం నరేందర్‌రెడ్డి సన్మాన సభకు హాజరుకాని కీలక నేతలు
- రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక అయినందున కార్యక్రమం
- ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి, ఎంపీ బలరాం గైర్హాజరు
- ఎమ్మెల్యేలు దొంతి, మురళీనాయక్, యశస్వినీరెడ్డి సైతం..



హనుమకొండ, మే 24 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెత్తనంపై ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మధ్య ఆధిపత్య పోరు మరోసారి బహిర్గతమైంది. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డికి వరంగల్‌లో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, ఆరు డీసీసీల అధ్యక్షులు, ముఖ్యనేతలకు ఆహ్వానం అందింది. వరంగల్ నగర పరిధిలో ప్రభుత్వ, అధికార పార్టీ పరంగా జరిగే ప్రతి చిన్న కార్యక్రమానికీ హాజరయ్యే ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఈ సన్మాన కార్యక్రమానికి దూరంగా ఉండటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సన్నిహితంగా ఉండే మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, మురళీనాయక్, యశస్వినీరెడ్డి కూడా ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారనే అసంతృప్తితో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మంత్రులు కొండా సురేఖ, సీతక్కకు మధ్య విభేదాలు పెరిగాయి. తాజాగా, ఇద్దరు వివరాలు 3లో..

## చర్చలలో గణనీయ పురోగతి

- శాంతి ఒప్పందంపై విస్తృత చర్చలు : ట్రంప్ అణు కార్యక్రమంపై చర్యలకు అంగీకరించం : ఇరాన్



న్యూఢిల్లీ, మే 24 : ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చలలో 'గణనీయ పురోగతి' కన్పిస్తోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. అయితే ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకుండా చేయాలన్న అమెరికా లక్ష్యాన్ని ఆయన పునరుద్ఘాటించారు. 'ఇరాన్ వద్ద ఇకపై అణ్వాయుధం అనేదే ఉండకూడదు. ఈ విషయంలో మా అధ్యక్షుడు చాలా స్పష్టమైన వైఖరితో ఉన్నారు' అని అన్నారు. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న నౌకలను ధ్వంసం చేస్తామంటూ ఇరాన్ చేస్తున్న హెచ్చరికలు ప్రమాదకర సంప్రదాయానికి తెర తీస్తున్నా యని చెప్పారు. 'అది వారి సొంతం కాదు. అది అంతర్జాతీయ జలమార్గం. దానిని ఉపయోగించుకుం టున్న వాణిజ్య నౌకలను ధ్వంసం చేస్తామని వారు చెబుతున్నారు.ఇది చట్టవిరుద్ధం' అని అన్నారు. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ శాంతి ఒప్పందంపై విస్తృత చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. హార్ముజ్‌ను తిరిగి తెరవడం జరుగుతుందని అన్నారు. ఇరాన్ తాజా ప్రతిపాదనను సమీక్షించి ఒప్పందానికి తుది రూపు ఇవ్వాలని ఆయన ప్రాంతీయ నేతలను కోరారు. 'ఒప్పందం పైన అయినా సంతకం జరగాలి. లేకుంటే వివరాలు 3లో..

## రైతు నెత్తిపై డీజిల్ గుదిబండ

- ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు అదనపు ఖర్చు
- దున్నకం నుంచి రవాణా వరకు ప్రత్యక్ష ప్రభావం
- ఎరువుల ధరలు కూడా పెరిగే అవకాశం!
- తెలంగాణ రైతాంగంపై దాదాపు రూ. 5 వేల కోట్ల భారం



హైదరాబాద్, మే 24: మోడీ సర్కారు పది రోజుల వ్యవధిలో మూడు సార్లు డీజిల్ ధరల రేట్లను పెంచడం రైతాంగం నెత్తిపై గుదిబండగా మారింది. ఇప్పటికే లీటర్ డీజిల్‌పై రూ.5 వరకు పెంచిన ఆయిల్ కంపెనీలు మరో రూ.25 వరకు పెంచుకునే అవకాశం కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయి. అదే జరిగితే వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయే ప్రమాదం కనిపిస్తుంది. తెలంగాణ రైతాంగంపై ఈ వానాకాలం సీజన్‌లో డీజిల్ ధరల పెంపు వల్ల రూ.3 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు అదనపు భారం పడే అవకాశముందని రైతు సంఘాల నేతలు చెప్తున్నారు. రోహిణి కార్తె ప్రారంభమైంది. ఇప్పటికే అన్నదాతలు వానాకాలం పంటల సాగు కోసం సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రంలో సుమారు కోటీ 36 లక్షల ఎకరాల మేరకు భూమి సాగవుతున్నది. అందులో కోటికిపైగా ఎకరాల్లో ట్రాక్టర్ల ఆధారితంగానే రైతులు వ్యవసాయాన్ని చేస్తున్నారు. వివరాలు 3లో..

# డివివోగా పదోన్నతి పొందిన శ్రీనివాస్ గౌడ్‌కు ఘన సన్మానం



బలగం, టీవీ ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండలంలో గతంలో ఎంపిడిఓ గా విధులు నిర్వర్తించిన గున్నాల శ్రీనివాస్ గౌడ్ డివివో గా సిద్ధిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివారం వల్లంపట్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సిడిపివో నాయిని ఎల్లయ్య, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ గౌడ్,సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్,మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్,కట్ట నర్సింహా రెడ్డి,నాయిని ధర్మయ్య, నాయిని రమేష్, నేరెళ్ల శ్రీనివాస్,నాయిని మల్లేశం, పులి మల్లేశం,కీసరి రవి,నేరెళ్ల రాజు కాసారపు పర్శరాములు, నాయిని మహేందర్ పాల్గొన్నారు.

# జిల్లా ఉప సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులుగా లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి ఎన్నిక..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లో ఆదివారం వివిధ మండలాల మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అందరూ కలిసి జిల్లా ఉప సర్పంచ్ల ఫోరమ్ అధ్య క్షులుగా లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.ఈ సమావేశంలో తంగళ్ళపల్లి మండలం మండల ఉపసర్పంచ్ల పోరం అధ్యక్షులు ఆసాని శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల ఉప సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు మందాటి రాము యాదవ్, వీరపల్లి మండలం ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అజ్మీరా రామ్ రెడ్డి నాయక్, ముస్తాబాద్ మండలం ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు విజయ రెడ్డి, కోనరావుపేట మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు. లంబ రాజు యాదవ్, బోయన్ పెల్లి మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి, చందుర్తి మండల ఉపసర్పంచల పోరం అధ్యక్షులు గంట మల్లేష్, వేములవాడ రూరల్ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సిపిఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శిగా ఎలిగేటి రాజశేఖర్ ఏకగ్రీవ ఎన్నిక



బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

సిపిఎం సిరిసిల్ల పట్టణ నూతన కార్యదర్శిగా ఎలిగేటి రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సిరిమల సత్యం అధ్యక్షతన సిపిఎం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ సమక్షంలో పట్టణ కార్యదర్శిగా ఎలిగేటి రాజశేఖర్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన పట్టణ కార్యదర్శి రాజశేఖర్ సిరిసిల్ల పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజాపక్షాన నిలుస్తూ, పార్టీ బలోపేతానికి శ్రేణులన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు .ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు అన్నల్‌దాస్ గణేష్, సురం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, జిందం కమలాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి



బలగం టీవి, బోయినిపల్లి;

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏం చేసిందనే వారి కోసం మాత్రమే. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అల్వాల ధర్మయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ: రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేసిందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారని, గ్యాస్ సబ్సిడీతో పాటు రైతు భరోసా, కుల గణన పూర్తి, రైతు కూలీలకు రైతు భరోసా, సన్న వడ్లకు 500 బోనస్, సంవత్సరంలో 55 వేల ఉద్యోగాలు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక కేవలం రైతుల కోసమే 55 వేల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నారని పేర్కొన్నారు.

# ఈత సరదా విషాదంగా మారకుండా జాగ్రత్తలు వహించండి

- ఎస్పీ మహేష్ బి. గితే





బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు, యువకులు చెరువులు, కాలువల్లో ఈతకు వెళ్లే ప్రమాదం ఉన్నందున తల్లి దండ్రులు, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు, సరదాగా ఈత నేర్చుకోవడానికి చాలామంది నీటి వనరుల వైపు మొగ్గు చూపుతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో జరిగే చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు . సరదాగా మొదలయ్యే ఈత ప్రయాణం కుటుంబాల్లో విషాదాన్ని నింపకూడదని అన్నారు. ముఖ్యంగా ఈత రానివారు ఒంటరిగా బావులు, చెరువులు, కాలువల వద్దకు అస్సలు వెళ్లకూడదని,ఒకవేళ ఈత నేర్చుకోవాలనుకుంటే, తప్పనిసరిగా పెద్దలు లేదా తల్లిదండ్రులు తమ సమ క్షంలోనే నేర్పించాలనిసూచించారు.సెలవుల్లోపిల్లలుఎక్కడికివెళ్తున్నారు, ఏం చేస్తున్నారనే విషయాలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, వారి కదలికలను గమనిస్తూ చెరువులు, కుంటల వైపు వెళ్లకుండా కట్టడి చేయాలని కోరారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి..



- భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్, ఐఏఎస్
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీ ఎస్ లోకేష్ కుమార్ ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై శనివారం హైదరాబాద్ నుండి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీ ఎస్ లోకేష్ కుమార్ ఐఏఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు రెవెన్యూలతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మార్కెట్ డిమాండ్, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్ విలువల సవరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను నిశితంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా శాస్త్రీయంగా ఈ విలువలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, సబ్ రిజిస్ట్రార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తైక్వాండోతో పిల్లల్లో మానసిక దృఢత్వం



- చదువుతో పాటు ఆటలూ కీలకమే : మట్టా నాగేందర్, మొహిన్
- ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతుల అందజేత

బలగం టీవీ,-ముషీరాబాద్

తైక్వాండో ద్వారా పిల్లలు శారీరకంగానే కాకుండా మానసికంగానూ దృఢంగా తయారవుతారని తెలంగాణ న్యూ తైక్వాండో అసోసియేషన్ (టీఎన్‌టీఏ) అధ్యక్షులు మట్టా నాగేందర్‌కుమార్, సిక్త్ డాన్ బ్లాక్ బెల్ట్ గ్రహీత, అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారుడు, చీఫ్ ఎగ్జామినర్ మొహిన్, ఎస్పీటీఏ ప్రధాన కార్యదర్శి, బ్లాక్ బెల్ట్ థర్డ్‌డాన్, సూపర్ పవర్ తైక్వాండో ప్రధాన కార్యదర్శి పి.సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సూపర్ పవర్ తైక్వాండో అకాడమీలో బెల్టు గ్రాండింగ్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు నాన్‌చాక్, కర్రసాము, తదితర యాక్టివిటీలను, బెల్టు టెస్టులను నిర్వహించారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన 40 మంది విద్యార్థులకు బెల్టులు, మెడల్స్ ఇచ్చి అప్‌గ్రేడ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో తమ పిల్లలను టీవీలు, మొబైల్ ఫోన్లకు అడిక్ట్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్ జీవీ. కార్తీక్, బ్లాక్ బెల్ట్ గ్రహీతలు ఎన్.సంజన, మోక్షత, రుద్రాన్ష్, రవికిరణ్, ఓ.కార్తికేయ, హర్షిత్, రవికిరణ్ పాల్గొన్నారు.

# చంద్రగిరి గ్రామ రైతుల పొలాల్లో అగ్ని ప్రమాదం..

- సర్పంచ్ చాకచక్యంతో తప్పిన భారీ ప్రమాదం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామ పరిధిలోని రైతుల పొలాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ముత్త సంజన మహేష్ గారు వెంటనే స్పందించి ఫైర్ సిబ్బంది మరియు పోలీస్ శాఖకు సమాచారం అందించారు. అనంతరం గ్రామ యువకులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు.ఫైర్ సిబ్బంది, పోలీస్ శాఖ, గ్రామ యువకుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముత్త సంజన మహేష్ మాట్లాడుతూ.. రైతులు మరియు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పొలాల్లో అగ్ని ప్రమాదాలకు దారితీసే చర్యల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ప్రమాద సమయంలో వెంటనే స్పందించి సహకరించిన ఫైర్ సిబ్బందికి, పోలీస్ శాఖకు మరియు గ్రామ యువకులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

# వివో ఏల నిరవధిక సమ్మె..



బలగం టీవి, బోయినిపల్లి: గత 20 సంవత్సరాలుగా గ్రామీణ పేదరిక సంస్థలో వెట్టి చాకిరి పనులు చేస్తూ, అదనపు పనులు ఆన్లైన్ వర్క్స్ చేస్తూ, చాలీచాలని జీతంతో పనులు చేస్తూ, వెట్టి చాకిరి చేస్తున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా శ్రమకు తగ్గ వేతనం 20000 ఇవ్వాలని సమ్మె చేస్తున్నారు.అలాగే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ సమ్మెలో భాగం గా మా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్ప డం జరిగింది.ఈ సమ్మెలో జిల్లా అధ్యక్షురాలు మంత్రి మనెమ్మ, మండల అధ్యక్షురాలు గుండేటి వరలక్ష్మి, వివో ఏ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


# చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసిన వెంకట్రావుపల్లి గ్రామస్తులు



బలగం టీవీ, బోయినిపల్లి; రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామస్తులు చొప్పదండి శాసనసభ్యులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి పూల బొకే అందజేశారు. గౌడ సంఘం భవన నిర్మాణానికి, పెరిక సంఘం నిర్మాణానికి మరియు మున్నూరు కాపు సంఘం ప్రహారి గోడకు వెంకట్రావుపల్లి సర్పంచ్ సంధ్య- మహేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించారని, ఎమ్మెల్యేకు వెంకట్రావుపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, కృతజ్ఞతలు తెలిపారు.

# టిప్పర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమంగా రవాణా

- టిప్పర్‌తో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్.ఐ రమాకాంత్




బలగం టీవి, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి స్టేజి వద్ద తేదీ 24/ /05/2026 రోజున సాయంత్రం 6 గంటల సమయంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా టీఎస్ 30 టి 4878 అను నెంబర్ గల టిప్పర్ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమంగా రవాణా చేస్తున్నందున పోలీసు వారు ఆ టిప్పర్ తో పాటు డ్రైవర్ బొజ్జ అనిల్ ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు బోయినిపల్లి ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు.

# కటాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

## ఒకరు మృతి



బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి.. మృతుడు నిజామాబాద్ జిల్లా బిక్నూర్ మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన బక్కి నర్సయ్యగా గుర్తింపు..సంఘటన స్థలానికిచేరుకున్న పోలీసులు... రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

(మొదటిపేజీ తరువాయి)

# ఫ్రీ కరెంట్ రద్దు కోసమే మోటార్లకు మీటర్లు

కాంగ్రెస్ ఎగ్గొట్టడంతో పాటు ప్రతి ఒకరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న మీటర్లు తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. గతంలో దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైన ప్రీపెయిడ్ మీటర్లను రాష్ట్రంలో పెట్టాలని ప్రధాని మోదీ తీవ్ర ఒత్తిడి తెచ్చారని, ఇందుకోసం రాష్ట్రానికి రావాల్సిన రూ.30వేల కోట్ల రుణాలను ఆపినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వెనకి తగ్గలేదని కేటీఆర్ గుర్తుచేశారు.రైతుల ప్రయోజనాల కోసం మోదీని ఎదిరించిన ఘనత కేసీఆర్‌ది అయితే.. అధికారంలోకి రాగానే వచ్చే మూడు నెలల్లోనే ఇండ్లు, వ్యవసాయ రంగానికి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని శనివారం క్యాబినెట్‌లో కాంగ్రెస్ నిర్ణయించడం దారుణమని మండిపడ్డారు. మొబైల్ రీఛార్జ్ తరహాలో కరెంట్ మీటర్లు పెట్టి, పేదలు, రైతుల పొట్టగొట్టే ఈ కరెంటు కుట్రలపై ప్రజలు తిరుగబడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ధాన్యం, వడ్లు, మకలు కొనుగోలు చేయకపోవడంతో ఎకడికకడ రైతులు రోడ్లపైనే ఆరబోసుకుని కూర్చున్నారని తెలిపారు.ఒకవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలపైనే రైతులు గుండెలాగి చనిపోతున్నారని, మరోవైపు వడదెబ్బకు అన్నదాతలు ప్రాణాలు కోల్పోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేకుండా వ్యవహరిస్తున్నది. ఇవాళ రైతుల కండ్లల్లోంచి కన్నీరు కాదు, నెత్తురు కారుతు న్నది' అంటూ సాగునీరు, సాయం అందక రైతాంగం పడుతున్న ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ పైన ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు బలమైన గుణపాఠం చెప్తారని కేటీఆర్ పేర్కొన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి, అడుగడుగునా అరాచకాలు, అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఐదు సంవత్సరాల కాలంలో సగం పూర్తయినా ఇప్పటిదాకా ప్రజలకు గాని, రాష్ట్రానికి గాని కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేక చేతులెత్తేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, పరిపాలనా వైఫల్యాలు, అవినీతిపై ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని, కచ్చితంగా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని కేటీఆర్ తెలిపారు.

# రైతు నెత్తిపై డీజిల్ గుదిబండ

ఎద్దులతో దున్నకం చాలా పరిమితమైంది. దున్నకం నుంచి పండించిన పంటలను మార్కెట్‌కు తరలించేదాకా గ్రామీణ వ్యవసాయంలో ట్రాక్టర్లదే కీలక భూమిక. మే నెల ద్వితీయ పక్షంలో పెద్దనాగళ్లతో భూములను లోతుగా దున్నించడం ఆనవాయితీ. అది భూమి ఆరోగ్యానికి కూడా మేలు చేసే ప్రక్రియ. ఇటువంటి పరిస్థితుల్లో పుండు మీద కారం చల్లినట్టు పది రోజుల వ్యవధిలోనే డీజిల్ ధరలు మూడు సార్లు పెరిగాయి. డీజిల్ ధరల పెంపు ప్రభావం భూముల దున్నకాలపై నేరుగా పడబోతున్నది. తెలంగాణలో ఎర్రరేగడి, నల్లరేగడి, దుబ్బలు, ఎర్రచెల్కలు, సౌడునేలలు వంటి భూములు ఆయా ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిని పెద్దనాగళ్లతో ఎకరా దున్నేందుకు గత సీజన్‌లో రైతుల నుంచి రూ.1500 నుంచి రూ.2,500 వరకు ట్రాక్టర్ల వాళ్లు వసూలు చేశారు. ఇప్పుడు డీజిల్ ధరలు పెరిగాక దాన్ని రూ.2,000 నుంచి రూ.3,000 వరకు పెంచారు. సీజన్ డిమాండ్‌ను బట్టి కొన్ని ప్రాంతాల్లో ఇంతకంటే ఎక్కువే అడుగుతున్నారు. ఇలా ఒక్క వేసవి దున్నకాల ద్వారానే రైతులపై రూ.700 కోట్ల నుంచి రూ. 1000 కోట్ల వరకు తెలంగాణ రైతాంగంపై భారం పడుతుంది.ఏడు నాగళ్ల ద్వారా ఎకరా దున్నకానికి రూ.1300 నుంచి రూ.1800 వరకు, కల్టివేటర్‌కు రూ.800, పొడి దుక్కిలో గుంట్క కొడితే ఎకరాకు రూ.800 నుంచి రూ.1200, పత్తిచేన్లలో గుంట్క కొడితే రూ.1,000 నుంచి రూ.1500 వరకు, పంట చేన్లలో రసాయన మందుల పిచికారీకి ఎకరాకు రూ.250 నుంచి రూ.500 వరకు తీసుకుంటున్నారు. డీజిల్ ధరల పెరుగుదలతో వీటికి రేట్లు రూ.300 నుంచి రూ.700 వరకు పెరిగనున్నాయి. డీజిల్, పెట్రోల్ ధరలు కూడా వరుసగా పెరుగుతుండటంతో ఆ ప్రభావం ఎరువుల ధరల పెరుగుదలపైనా ప్రత్యక్షంగా పడుతోంది. పంటలు పండిన తర్వాత మార్కెట్లకు తరలించడానికి, ఇండ్లకు తరలించడానికి, కూలీలను చేన్ల వద్దకు తరలించడానికి ఆటోలు, ట్రాక్టర్ల రవాణా చార్జీలు కూడా పెరిగే అవకాశముంది. ఇలా భూమిని చదును చేసే దగ్గర నుంచి పంటలను అమ్ముకునేదాకా డీజిల్ ధరల ఎఫెక్ట్ రైతులపై నేరుగా పడబోతున్నది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే అవకాశాలున్నప్పటికీ విదేశాంగ విధానంలో మోడీ సర్కారు అనురిస్తున్న విధానాల ప్రభావం ప్రతిబంధకంగా మారింది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నుంచి తక్కువ ధరకు ముడి చమురు వచ్చే అవకాశమున్నప్పటికీ అమెరికా ఒత్తిళ్లకు లొంగి ఆ రెండు దేశాలకు మన దేశం క్రమంగా దూరమవుతున్నది. మరోవైపు ఆధిపత్యం కోసం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ప్రభావం వల్ల చమురు ధరలపై నేరుగా పడుతున్నది. ఈ యుద్ధం విషయంలోనూ అలీన విధానాన్ని పక్కనబెట్టి మోడీ సర్కారు ఇజ్రాయిల్, అమెరికా దేశాలకు వంత పాడుతున్నది. అదే సమయంలో కార్పొరేట్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టే చర్యల్లో భాగంగా దొడ్డిదారిన రైతాంగంపై భారాలు మోపే చర్యలకు ఉపక్రమించింది. ఒకవేళ రైతులపై నిజంగానే కేంద్ర పాలకులకు చిత్తశుద్ధి ఉంటే కష్టకాలంలో ప్రజలపై ఆయిల్ కంపెనీలు భారాలు మోపుతున్న సమయంలో తాము వేస్తున్న పన్నుల శాతాన్ని తగ్గించే అవకాశమున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించడం లేదు.

# నెలాఖరుకు కొనుగోళ్లు బంద్!

కానీ ఇప్పటివరకు 13 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. ఈ లెక్కన ఇంకా 9 లక్షల టన్నుల మక్కలు బయటే ఉన్నాయి. ఈ వారం రోజుల్లో ఎంత కొనుగోలు చేస్తారో? తెలియదు. మిగిలిన పంట కొనుగోలుకు ఎగనామం పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెలదాటినా కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన పంటలు కాంటా పెట్టని దుర్భర పరిస్థితులు ఉన్నాయి. గన్నీ సంచు లు, వాహనాలు, గోదాములు, హమాలీల కొరత అంటూ సవాలక్ష కారణాలతో ధాన్యం, మక్కల కొనుగోలును కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. సగం పంటను కొనుగోలు చేసిన సర్కార్.. కొనుగోలు కేంద్రాలను బంద్ చేస్తే మిగిలిన సగం పంటను ఎక్కడ అమ్ముకోవాలి? అంటూ రైతులు లబోదిబోమంటున్నారు. కొనుగోలులో నిర్లక్ష్యానికి, తమకు కలుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యులు? అంటూ నిలదీస్తున్నారు. బహిరంగ మార్కెట్లో విక్రయిద్దామంటే కొనుగోలు చేసే దిక్కేలేదు. ఒకవేళ అమ్ముదామన్నా అడ్డికి పావుసేరు చొప్పున కొంటున్నారు. ధాన్యానికి మద్దతు ధర రూ.2,389 ఉండగా, బహిరంగ మార్కెట్లో రూ.1,800కే కొనుగోలు చేస్తున్నారు. మక్కలకు మద్దతు ధర రూ.2,400 ఉండగా, మార్కెట్లో రూ.1,700–1900కే కొంటున్నారు. ఇలా ప్రైవేట్‌కు విక్రయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రాలు మూసివేయాలంటూ సర్కార్ నిర్ణయం తీసుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంటల కొనుగోలులో సర్కార్ నిర్లక్ష్యానికి తోడు వానగండం రైతులను భయపెడుతున్నది. ముందే రుతుపవనాలు రావడం, అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. సంగారెడ్డి, మెదక్, సిరిసిల్ల, మహబూబ్‌నగర్, గద్వాల, నారాయ ణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో గాలివానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వర్షం నుంచి తమ రాశులను కాపాడుకోవడం రైతులకు అతిపెద్ద సవాల్‌గా మారింది. తడిసిన పంటల కొనుగోలు మరింత ఆలస్యం అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికైనా సర్కార్ స్పందించి కొనుగోలులో వేగం పెంచాలని, పూర్తి పంట కొనుగోలు చేసే వరకు కేంద్రాలను తెరిచే ఉంచాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నది.

## వరంగల్ కాంగ్రెస్‌లో ఆధిపత్యపోరు..

మంత్రులు వేం నరేందర్‌రెడ్డి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార పార్టీలో కొత్త రాజకీయ సమీకరణలు మొదలయ్యాయనే చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ నిర్ణయాలు అమలు, కాంగ్రెస్ పార్టీలో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జోక్యానికి అడ్డుకట్ట వేసేలా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఏకమయ్యారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వివిధ పనుల విషయంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మంత్రులు కొండా సురేఖ, సీతక్క అసంతృప్తితో ఉన్నారు. ఎమ్మెల్యేలు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. స్థానిక సమీకరణలను పట్టించుకోకుండా ఇన్‌చార్జి మంత్రి నిర్ణయా లు తీసుకోవడం వల్ల తమకు రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా ఉన్న వేం నరేందర్‌రెడ్డి తాజాగా రాజ్యసభకు ఎన్నికైన నేపథ్యంలో ప్రభుత్వ, అధికార పార్టీ వ్యవహారాలపై ఆయననే సంప్రదించాలని ఉమ్మడి జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిర్ణయించుకున్నారు.

## చర్చలలో గణనీయ పురోగతి

వారిపై తీవ్రంగా దాడి అయినా జరగాలి' అని అన్నారు. ఇరాన్‌తో ఒప్పందం కుదరడానికి, కుదరకపోవడానికి సమానంగా అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. కాగా తన అణు కార్యక్రమానికి సంబంధించిన ఎలాంటి చర్యలకు టెహ్రాన్ అంగీకరించలేదని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. జలసంధి మీదుగా నౌకల రాకపోకలు పూర్వపు స్థితికి చేరుకోబోవని స్పష్టం చేసింది.

# ఆర్‌డీఎస్‌ఎస్ అమలుతో తెలంగాణ చీకటే

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి**




**హైదరాబాద్, మే 24:** 'ఆర్‌డీఎస్‌ఎస్(రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) అమలుతో వి ద్యుత్ వినియోగదారుల నెత్తిన పిడుగుపడబోతున్నది. ఫ్రీ పవర్ స్కీమ్ గృహజ్యో తి పథకం కనుమరుగుకానున్నది. లాండ్రీలు, సెలూన్లకు ఇచ్చే 250 యూనిట్ల ఫ్రీ కరెంట్‌ను ఎత్తేసే ప్రమాదమున్నది. వెరసి తెలంగాణ మొత్తం చీకటయ్యే పరిస్థితి కనిపిస్తున్నది' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ స్కీమ్ రైతాంగానికి శాపంగా మారనున్నదని స్పష్టంచేశారు. ఆర్‌డీఎస్‌–ఎస్ ముసుగులో దక్షిణ, ఉత్తర విద్యుత్తు సంస్థలను ప్రైవేటీకరించేందుకు రేవంత్ సర్కార్ కుట్ర పన్నుతున్నదని విరుచుకుపడ్డారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు వ్యతిరేకించిన ఈ ప థకాన్ని తెలంగాణ ప్రజల నెత్తిన రుద్దడం దారుణమం టూ ధ్వజమెత్తారు. ఆదివా రం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేత లు ఓ నర్సింహారెడ్డి, ఉపేంద్ర, పల్లా ప్రవీణ్‌రెడ్డి, వెంకటనారాయణగౌడ్‌తో కలిసి ఆయన విలేక రులతో మాట్లాడారు. నాడు ప్రతిపక్షంలో ఎగిరెగిరిపడ్డ రేవంత్‌రెడ్డి.. ఇవాళ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు పెట్టేందుకు ఒప్పుకోవడం శోచనీయమని మం డిపడ్డారు. ప్రభుత్వం తీసుకురానున్న రైతు డిస్కమ్‌ను అదానీకి కట్టబెట్టే కుటిల యత్నం జరుగుతున్నదని ఆరోపించారు. ఆర్‌డీఎస్‌ఎస్‌లో చేరాలని కేంద్రం ఒత్తి డి తెచ్చినా కేసీఆర్ మొదటినుంచీ వ్యతిరేకించారని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. ఎట్టిపరిస్థితుల్లో మోటర్లకు మీటర్లు బిగిస్తే ఒప్పుకొనేది లేదని తెగేసి చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తానని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్.. ఇప్పుడు గతంలో కేసీఆరే ఒప్పుకొన్నారని పచ్చి అబద్ధాలు చెబుతున్నారంటూ నిప్పులు చెరిగారు. 'ఈ పథకం కింద ఉత్తరప్రదేశ్‌లో మీటర్లు పెడితే మ హిళలు తగులబెట్టారు.. వేలాది మంది రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలో అమలు చేసి వెనక్కి తీసుకున్నారు' అని గుర్తుచేశారు. ఇవన్నీ తెలిసినా రేవంత్ మాత్రం బుకాయిస్తున్నారని దుయ్యబట్టారు. యూపీ లో వ్యతిరేకించిన కాంగ్రెస్.. తెలంగాణ లో అనుకూలంగా వ్యవహరించడం సిగ్గుచేటని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసలు కాంగ్రెస్ జాతీయ పార్టీనా? ప్రాంతీయ పార్టీనా అని ఎద్దేవా చేశారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలకు నష్టం జరుగుతుం దని, ముందు రీచార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుందని, లేదంటే కట్ అవుతుందని స్పష్టంచేశారు. ఈ మీటర్లు పెట్టుకొనేందుకు రూ.6వేల దాకా ఖర్చవుతుందని, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఇచ్చే కమీషన్లతో ఇంకా ఎంతకు పోతుందో తెలియదంటూ దెప్పిపొడిచారు. రూరల్ డిస్కమ్ తెచ్చి అదానీకి అప్పగించేం దుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్‌ను త్వరలోనే ప్ర జలు బంగాళాఖాతంలో విసిరివేయ డం ఖాయమని హెచ్చరించారు. ఆర్‌డీఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ మరో పోరాటానికి శ్రీకారం చుట్టబోతుందన్నారు.

# వైఎస్ రాజారెడ్డి అరచకాలు అన్నీ ఇన్నీకావు

- వైఎస్ మరణం ఎలా జరిగిందో అందరికీ తెలుసు
- జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ అనకాపల్లి ఎంపి సిఎం రమేశ్



**అమరావతి,మే23 :** పులివెందులలో వైఎస్ రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. శనివారం అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడ య్యారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు. ఎస్టీ కులాన్ని అడ్డుపెట్టుకుని రాజారెడ్డి దోపిడీలు చేశారని.. ఇలా పోలీసుల రికార్డుల్లో కూడా ఉందని గుర్తుచేశారు. పులివెందులలో పార్నపల్లి గ్రామంలో రాజారెడ్డి చేసిన ఆకృత్యాలకు ఇంకా సజీవ సాక్షులు ఉన్నారని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి ఎందరినో రాజకీయ లబ్ధి కోసం హత్య రాజకీయాలు చేశారని ఆరోపించారు. రాజారెడ్డిని హత్య చేసింది ఆయన వల్ల ఇబ్బంది పడిన బాధితులేనని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి మీద రౌడీషీట్ సహా పలు కేసులు గతంలో ఉన్నాయని ప్రస్తావించారు. ఆ సమయంలో చంద్రబాబు సీఎం కాదని.. టీడీపీ ప్రభుత్వమే లేదని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు.

## జగన్ కుటుంబ రాజకీయం అందరికీ తెలిసిందే

- ఇప్పడేమో అహింసావాదిలా పోజులు కొడుతున్నాడు
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి,మే24 :** గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా తాను చాలా అమాయకుణ్ణి, అహింసావాదిని అంటూ మాట్లాడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ చురకలు వేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పూర్వీకుల చరిత్ర, ఆయన చరిత్ర ఏంటి అనేది ప్రపంచంలో అందరికీ తెలుసన్నారు. ఎన్ని దారుణాలు చేశారో, ఎన్ని హత్యలు చేశారో రాయలసీమలో ఏ గడపని అడిగినా చెప్తారని అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం గురించి ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారని వ్యాఖ్యానించారు. అటువంటి రాజారెడ్డి పోలికలు తనకొచ్చాయని చెప్పుకున్న వ్యక్తి జగన్ అంటూ దుయ్యబట్టారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చేసిన అరాచకాలు కళ్లారా చూశామని మంత్రి అన్నారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. తన వ్యాపారానికి అడ్డుగా ఉన్న ప్రతి ఒక్కరినీ హతమార్చారని జగన్‌పై మంత్రి ఆరోపణలు గుప్పించారు. పరిటాల రవితో సహా ఎంతోమందిని హత్య చేశారన్నారు. అమరనాథ్ గౌడ్, సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం విషయంలో ఏమైందో అందరికీ తెలుసన్నారు. 'తల్లిని తరిమేశాడు.. చెల్లిని ఆస్తి కోసం తరిమేశాడు.. అతని వ్యక్తిత్వం అలాంటిది' అంటూ వ్యాఖ్యానించారు. బాబాయ్ హత్య కేసుపై సీబీఐ వచ్చి ఎంక్వైరీ చేస్తుంటే.. తన పార్టీ ఎంపీని కాపాడేందుకు సీబీఐ అధికారులపైనే దాడి చేసి తరిమేశారని మండిపడ్డారు. వైఎస్ సునీత ఆవేదన కనిపించటం లేదా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా చేసిన ఐదేళ్లలో బాబాయ్‌ను హత్య చేసిన వ్యక్తిని కనుక్కోలేకపోయారా అని నిలదీశారు. తప్పుదోవ పట్టిద్దామనుకుంటే నమ్మే స్థితిలో ఏపీ ప్రజలు లేరన్నారు. ఇప్పుడు ఆ 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నారు. 'ఈరోజు రాష్ట్రం సుభిక్షంగా ఉంది. పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. యువత హ్యాపీగా ఉంది. ఉద్యోగాలు వస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందన్న ఆనందంలో ప్రజలు ఉన్నారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# లాయర్ హత్యపై సిట్ ఏర్పాటుచేయాలి

- రాష్ట్రంలో రోజురోజుకూ దిగజారుతున్న శాంతిభద్రతలు
- అడ్వకేట్ మొయిజుద్దీన్ రక్షణలో పోలీసులు పూర్తిగా విఫలం
- నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- హైకోర్టు సీనియర్ లాయర్ ముఖీద్, న్యాయవాదులు

**హైదరాబాద్, మే 24:** హైదరాబాద్‌లో సీనియర్ న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ హత్యా ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని హైకోర్టు సీనియర్ లాయర్, బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ ప్రతినిధి ఎంఏ ముఖీద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను శిక్షించాలని కోరారు. వక్ఫ్ భూములను కాపాడేందుకు పోరాడిన ఆయనను దుండగులు హతమార్చడం దారుణమని ఖండించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ ప్రతినిధులు అమృత్‌రావు, కావ్య, కిరణ్‌రావు, వంశీకృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తంచేశారు. లాయర్లపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయని, పట్టపగలే దారుణంగా హతమారుస్తున్నారని ఆరోపించారు. ఖాజా మొయిజుద్దీన్‌కు ప్రాణహాని ఉన్నదని తెలిసినా రక్షణ కల్పించడంలో పోలీస్‌శాఖ దారుణంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పోలీస్‌స్టేషన్‌లో స్పెషల్ కౌన్సెలింగ్ రూం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. తెలం గాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. మొయిజుద్దీన్ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆయన కొడుకు ఫర్హాన్, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

- నియోజకవర్గ అభివృద్ధి తదితరాలపై చర్చ
- అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచన

**అమరావతి,మే23 :** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకోవాలని సూచించినట్లు సమాచారం.

# అద్దెల పెంపు ప్రతిపాదనలు పంపొద్దు




## గురుకుల సొసైటీకి తేల్చిచెప్పిన ప్రభుత్వం

**హైదరాబాద్, మే 24:** గురుకుల భవనాలకు సం బంధించిన నెలవారీ అద్దెలను పెం చాలని ప్రతిపాదనలు పంపొద్దని ప్రిన్సిపాల్స్‌ను ఎస్సీ గురుకుల సొసైటీ ఆ దేశించింది. జోనల్ ఆఫీసర్లకు సొసైటీ కార్యదర్శి శారద ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ పరిధిలోని పలు గురుకుల పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజీలు అద్దె భవనాల్లో కొనసాగుతు న్నాయి. కిరాయిలను లోకల్ లెవల్ అసెస్‌మెంట్ కమిటీల ద్వారా ఆయా ప్రాంతాలవారీగా గతంలో నిర్ధారించా రు.గ్రామీణ ప్రాంతాల్లో స్కేర్ ఫీట్ రూ.8–14 చొప్పున, పట్టణ ప్రాంతా ల్లో రూ.12–20వరకు, హైదరాబాద్ పరిధిలోకి ఇంకా కొంచెం ఎక్కువగా నిర్ణయించా రు. సగటున ఒక్కో హాస్టల్ బిల్డింగ్‌కు నెలవారీగా కనిష్ఠంగా రూ. 2.50లక్షల నుంచి గరిష్ఠంగా రూ.14ల క్షల వరకు ప్రస్తుతం చెల్లిస్తున్నారు. అయితే భవన యజమానులు కొన్నేం డ్లుగా అద్దెలు పెంచాలని కోరుతున్నారు.లేదంటే భవనాలు ఖాళీ చేయాలని ప్రిన్సిపాల్స్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో అద్దె భవనాల కిరాయి పెంచాల ని కోరుతూ ప్రిన్సిపాల్స్ జోనల్ ఆఫీస ర్లు, వారు సొసైటీ ఉన్నతాధికారులకు పదే పదే ప్రతిపాదనలు పంపుతు న్నా రు. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదన లు సమర్పించారు. ప్రతిపాదనలపై తా జాగా ప్రభుత్వం స్పందించింది. అద్దెలు పెంచేది లేదని తేల్చి చెప్పింది. ఆయా ప్రాంతాలవారీగా కలెక్టర్ల ఆధ్వర్యంలో మరోసారి భవన అద్దెలు నిర్ధారించాలని సొసైటీకి స్పష్టం చేసింది.

## మీడియా సంస్థలకు 'బండి' నోటీసులు



- పోక్సో కేసులో తన పేరు వాడారని పరువునష్టం దావా

**హైదరాబాద్, మే 24 :** పోక్సో కేసులో తన పేరు ఉపయోగించి.. తన పరువుకు భంగం కలిగించారంటూ తెలుగు మీడియా సంస్థలకు, డిజిటల్ మీడియాకు, యూట్యూబర్లకు, పలు పార్టీల హ్యాండిల్స్‌కు, పలువురు నెటిజన్లకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పరువునష్టం దావా నోటీసులు పంపారు. కాగా, ఇదే అంశంపై వార్తలు రాసిన నేషనల్ మీడియాను మాత్రం ఆయన వదిలేశారు. దాదాపు 250కి పైగా పేజీల్లో వందలాది మంది పేర్లను, మీడియా సంస్థలను, సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను చేర్చారు. ఇందులో కాంగ్రెస్,బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులూ ఉన్నారు. గూగుల్, మెటా,ఎక్స్ సంస్థలకు సైతం ఆయన నోటీసులు పంపారు.

# రిజర్వేషన్లతో కొందరికే లబ్ది !

స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు...నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అంఉదకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమిలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయ పడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగలు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఎఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ది పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమీలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# నిప్పుల కొలిమిలా రాష్ట్రం


- అర్ధ సెంచరీ చేరువకు పగటిపూట ఉష్ణోగ్రతలు
- వడదెబ్బతో పెరుగుతున్న మృతుల సంఖ్య.. ఆగని మూగజీవాల మృత్యువాత
- కార్మికులు, కూలీల అవస్థలు.. పనుల్లేక ఇబ్బందులు
- పొట్ట కూటికోసం మండుటెండలో శ్రామిక వర్గం
- అగ్నిప్రమాదాలతో రూ. కోట్లల్లో నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు, రైతుల వేడుకోలు



**హైదరాబాద్, మే 24:** రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న తీవ్ర ఉష్ణోగ్రతలు సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతుండగా, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కూలీల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపుతూ 44 డిగ్రీల ఉష్ణోగ్రతతో బెంబేలెత్తిస్తున్నాడు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నమయేసరికి నిప్పుల కొలిమి తలపిస్తున్నది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సగం జిల్లాల్లో 46 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో50 డిగ్రీస్ ఉష్ణోగ్రత (హాఫ్ సెంచరీ) నమోదయ్య అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండదెబ్బతో వడదెబ్బకు గురై అనేకమంది చనిపోవడం.. అగ్నిప్రమాదాలు చోటు చేసుకుని పంటలు కాలిపోతున్నాయి. మరోవైపు అకాల వర్షాలు, ఈదురు గాలులు పంటలు తడిసిపోవడం,.. ఇలా రాష్ట్రంలో అటు ఎండలు, అకాల వర్షాలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులకూ వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. కార్మికులు పనులకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పుడే ఎండలకు జనాలు అల్లాడుతుంటే రోళ్లు పగిలే రోహిణికార్తె వస్తుండటంతో ఇంకా ఎండలు ఏ స్థాయిలో ఉంటాయోనని ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే మధ్యాహ్నం సమయాల్లో జ్యూస్ సెంటర్లకు చల్లటి పానీయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. మద్యం షాపులు మందుబాబులతో కిక్కిరిసిపోతున్నాయి.పంట వ్యర్థాలను తగులబెట్టే క్రమంలో కొందరు రైతులు ప్రదర్శిస్తున్ననిర్లక్ష్యం ఇతరుల పాలిట శాపమవుతోంది. పొలం పక్కన మంట పెట్టడంతో ఆ మంటలు వ్యాపించి జామాయిల్, మామిడి తోటలు కాలి బూడిదయ్యాయి. వడగాల్పుల ఉధృతికి ముగ్గురు మృతిచెందారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామ్మంకి చెందిన రైతు బూర రమేష్ కు పత్తిపాక శివారులో 3ఎకరాల జామాయిల్ తోట ఉంది. పక్క చేను రైతు మక్క వ్యర్థాలకు నిప్పు పెట్టగా, గాలి తీవ్రతకు మంటలు జామాయిల్ తోటకు వ్యాపించాయి. చేతికొచ్చే సమయంలో 8 లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మాటేడు గ్రామానికి చెందిన రైతు నగరబోయిన వెంకన్నకు చెందిన 28 ఎకరాల మామిడి తోట అగ్నికి ఆహుతైంది.పక్క రైతు పెట్టిన మంట వల్ల డ్రిప్ పైపులతో సహా తోట మొత్తం కాలిపోయింది. సుమారు కోటి రూపాయల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ఎండల తీవ్రత ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రాణాలు తీస్తోంది. తొర్రూరు మండలంలో అత్తిలి రాము (60), సోమనారాయణ (65) వడదెబ్బకు గురై మృతి చెందారు. అటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గుంటూరుపల్లిలో కట్టెల కోసం వెళ్లిన ఎర్రబోయిన జయలక్ష్మి (70) ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై ప్రాణాలు విడిచింది. బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మాచర్ల శ్రీను(51) ఓ ఇంట్లో మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అధికారుల నిర్లక్ష్యంతో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి విసంపల్లిలో చిన్నగూడూరు మండలంలో అల్లి రాజశేఖర్ అనే రైతుకు చెందిన పాడి గేదె మృ్తి చెందింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలో ఇద్దరు వడ దెబ్బతో మృతి చెందారు. మండలంలోని పారిగాం గ్రామానికి చెందిన కౌలు రైతు ఎలుకరి అశోక్ (41)కు సొంత భూమి లేకపోవడంతో ఇతరుల భూములు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శనివారం ఉదయం తన భార్య సోనితో కలిసి చేనులో పనులు చేశాడు. అనంతరం సాయంత్రం మళ్లీ పొలానికి వెళ్లి పనులు చేస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. కొద్దిసేపటికే కుప్పకూలి పడిపోయాడు. మండలంలోని జక్కాపూర్ గ్రామ్మంకి చెందిన పిప్రే సాయినాథ్ (45) వడదెబ్బతో మృతి చెందాడు. సాయినాథ్ కూలి పనులు చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో శనివారం తీవ్ర ఎండ ప్రభావానికి గురై స్పృహ కోల్పోయి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలంలోనూ యువకుడు మృతిచెందాడు. మామిడిగట్టు ఆదిల్‌పేట్ అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా మధిర మండలం ఇల్లూరు గ్రామంలో వడదెబ్బకు కొరివి అచ్చయ్య (80) ఆదివారం మృతి చెందారు. ఇటీవల పెరుగుతున్న ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఆయన అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ కు చెందిన రైతు చల్లా రంగయ్య(60) వడదెబ్బతో మృతి చెందారు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు
- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు





**టెహ్రాన్,మే24 :** పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం



ప్రస్తుత పరిస్థితుల్లో హాజరు కాలేనన్న ట్రంప్

**వాషింగ్టన్,మే24 :** ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాక పోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహమాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

# రూపాయి పతనంతో కలలు కల్లలు!

- విదేశాల్లోని భారత విద్యార్థుల తీవ్ర అవస్థలు
- ఖర్చులు భారీగా పెరుగడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి
- దూర ప్రాంతాలకు సైతం కాలి నడకన వెళ్లాల్సిన దుస్థితి
- ఉన్నత విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం.. కుటుంబాల్లో ఆందోళన

**న్యూఢిల్లీ:** డాలర్‌తో పోలిస్తే రూపాయి పతనం కావడం అనేది ఎక్కువగా చమురు దిగుమతులు, స్టాక్ మార్కెట్లు, వాణిజ్యలోటు కోణంలోనే చర్చకు వస్తున్నది. కానీ విదేశీ డిగ్రీ, చదువు తర్వాత మంచి ఆదాయం సంపాదించాలనే కలలతో ఇండ్లను వదిలివెళ్లిన లక్షలాది భారతీయ విద్యార్థులను సైతం ఇది తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. చదువు కంటే ఎక్కువగా రోజులు ఎలా గడుపాలన్న ఆలోచనలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. బలహీనపడుతున్న రూపాయి విలువ విదేశాల్లో ఉన్న అనేక మంది భారతీయ విద్యార్థులను బతుకడానికి బడ్జెట్ వేసుకునేలా చేసింది.అధికారిక పార్ట్ టైమ్ షిఫ్ట్‌లతోపాటు డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లు, రైల్వేస్టేషన్లలో ఫ్లోర్‌లను తుడవడం వంటి కష్టతరమైన పనులు చేయడం నుంచి, రోజుకు ఒక పూట మాత్రమే తింటూ జీవించడం లేదా అసలు భోజనమే మానేయడం వరకు.. పతనమవుతున్న రూపాయి మధ్య విదేశాలలో చదువుకోవడం అనేది చాలా కఠినంగా మారింది. విపరీతమైన సంపన్న కుటుంబాల నుంచి వచ్చినవారు తప్ప మిగిలిన చాలామంది పరిస్థితి ఇదే. భోజనాలు మానేస్తూ కేవలం మనుగడ కోసమే నిరంతరం పోరాడుతున్నప్పుడు ఇక చదువుపై ఎప్పుడు దృష్టి పెడుతారు? ఈ పోరాటం కేవలం విద్యార్థుల బరువు తగ్గడంలోనే కాకుండా వారి గ్రేడ్‌లలో కూడా ప్రతిఫలిస్తున్నది. మహారాష్ట్ర థానే జిల్లాలోని మధ్యతరగతి కుటుంబానికి చెందిన మాన్వి కోలి ఎడ్యుకేషన్ లోన్‌పై చదువుకోవడానికి లండన్ వెళ్లారు. రూపాయి పతనం ప్రభావం అక్కడి విద్యార్థులపై ఎలా ఉందో ఆమె వివరించారు. “లండన్‌లో 8 పౌండ్ల శాండ్‌విచ్‌ను కొనుగోలు చేయాలంటే, అది పారేయడానికి కొన్ని గంటల ముందు మాత్రమే సాధ్యమవుతుంది. 'టూ గుడ్ టు గో' యాప్ దీనిని 2.5 పౌండ్ల నుంచి 3 పౌండ్లకే విక్రయిస్తుంది. కానీ గడువు ముగిసిపోతున్న ఈ ఆహారాన్ని పొందడానికి విద్యార్థులం స్టోర్‌కు పరుగెత్తాలి. నేను సమయానికి వెళ్లకపోతే మరెవరైనా దానిని దక్కించుకోవచ్చు. కింగ్స్ కాలేజ్ లండన్ నుంచి నా మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఈ ఏడాది మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చేముందు దాదాపు మూడు నెలలు నేను లండన్‌లో ఇలాగే తిని బతికాను” అని మాన్వి కోలి చెప్పారు. కోలి భారతదేశం వదిలి వెళ్లినప్పుడు యూఎస్ డాలర్ విలువ సుమారు రూ.85గా ఉండేది.ఆమె తిరిగి వచ్చేసరికి అది దాదాపు రూ.93కి చేరింది. ప్రస్తుతం 95 దాటిపోయింది. ఏ క్షణంలోనైనా 100 మార్కును తాకొచ్చని నిపుణులు అంటున్నారు. యూకేలోనే కాకుండా అమెరికాలోని యూనివర్సిటీల్లో ప్రస్తుతం చదువుతున్న తన కజిన్, ఫ్రెండ్స్, ఇతర విద్యార్థులు సైతం 'టూ గుడ్ టు గో' వంటి యాప్‌ల ద్వారా లభించే డిస్కౌంట్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని కోలి గుర్తు చేసుకున్నారు. కోస్టా కాఫీ, స్టార్‌బక్స్ వంటి ఫుడ్ అవుట్‌లెట్‌లు గడువు ముగిసిపోతున్న ఆహారాన్ని ఈ యాప్‌ల్లో ఉంచుతాయి. ఆ లిస్టింగ్ లైవ్‌లోకి వచ్చిన వెంటనే పరుగెత్తాల్సిందే.ఎందుకంటే ఎవరైనా దానిని మొదట బుక్ చేసుకుంటే అది కొన్ని సెకన్లలోనే అయిపోతుంది అని కోలి అన్నారు. డబ్బు ఆదా చేయడానికి అమెరికాలోని చాలామంది విద్యార్థులు యూనివర్సిటీ నిర్వహించే ఆహార పంపిణీ కార్యక్రమాలపై ఆధారపడతారని న్యూయార్క్ యూనివర్సిటీ విద్యార్థిని సంజన ఎం కుమార్ చెప్పారు. చాలా యూనివర్సిటీలు వారానికి ఒకసారి కూరగాయలు, పాలు, కిరాణా సామగ్రిని పంపిణీ చేస్తాయి. విద్యార్థులు వాటిని తమ రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేసుకుంటారని తెలిపారు. విద్యార్థులు అపార్ట్‌మెంట్‌లను పంచుకొంటారు. కిరాణా సామగ్రిని కలిసి కొంటారు. డాలర్ బలపడినప్పుడు బయటకు వెళ్లడం, బయట తినడం, సామాజికంగా కలువడం వంటికి మొదటగా కట్ చేయబడతాయి అని సంజన అన్నారు.చాలా విదేశీ యూనివర్సిటీలు సెమిస్టర్ వారీగా ఫీజులు వసూలు చేస్తుంటాయి. రూపాయి పతనం కావడంతో చివరి సెమిస్టర్ల నాటికి అసలు ఎడ్యుకేషన్ లోన్ మొత్తం సరిపోవడం లేదు. మిగిలిన ఫీజును కవర్ చేయడానికి కుటుంబాలు టాప్ అప్ లోన్లు తీసుకోవాల్సి వస్తున్నది. యూకే, యూఎస్, ఆస్ట్రేలియా, సింగపూర్‌లోని విద్యార్థులందరిదీ ఇదే కథ. విద్యార్థులు కేవలం బయట తినడం మాత్రమే ఆపడం లేదు. క్యాలెండర్ల నుంచి నైట్ అవుట్‌లు మాయమవుతున్నాయి. క్యాబ్‌ల మాట దేవుడెరుగు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కూడా ఖరీదైనదిగా అనిపించడం ప్రారంభమవుతున్నది.

విద్యార్థులు కొన్నిసార్లు 10 కిలోమీటర్ల మేర సుదూర ప్రయాణాలను కాలినడకన సాగిస్తున్నారు. “యూకేలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ చాలా ఖరీదైనది. పీక్ అవర్స్‌లో వన్‌వే ట్యూబ్(మెట్రో) రైడ్ కోసం ఐదు పౌండ్లు ఖర్చవుతుంది. మీరు మెట్రో ఎక్కేముందు రెండుసార్లు ఆలోచిస్తారు” అని కోలి తెలిపారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లేదా ఖరీదైన క్యాబ్ రైడ్‌ల కోసం డబ్బులు ఖర్చు పెట్టడానికి బదులుగా చాలామంది సుదూర ప్రాంతాలకు కాలినడకన వెళ్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌లో చదివిన ఐశ్వర్య సేథ్ మాట్లాడుతూ.. చాలామంది విద్యార్థులు పౌండ్‌రూపాయి ఎక్స్ఛేంజ్ రేట్ మెరుగుపడుతుందనే ఆశతో క్వార్టర్లీ వసతి చెల్లింపులను ఆలస్యం చేస్తారు. కానీ చివరికి ఎక్కువ వడ్డీని చెల్లించాల్సి వస్తుంది.రేటు తగ్గుతుందని ఎదురుచూస్తూ ప్రజలు ఇరుక్కుపోతారని ఆమె చెప్పారు. విద్యార్థులు వారి అవసరాలు తీర్చుకోవడానికి కనీస వేతనం కంటే చాలా తక్కువ వేతనాలకే అదనపు క్యాష్ జాబ్స్ చేస్తారని వివరించారు. ప్రజలు వేర్‌హౌస్ పనులు, రెస్టారెంట్ల కోసం చెత్త సేకరించడం, తుడవడం, మాపింగ్ వంటివి చేస్తారు. చాలామంది రోజుకు ఒకపూట భోజనంతో బతుకుతారు. విపరీతంగా బరువు తగ్గుతారు. ఖర్చులు తగ్గించుకోవడానికి ఒకే గదిని ఏడెనిమిది మంది షేర్ చేసుకొంటారు.